కథ

సి.ఎస్.ఆర్.ప్రసాద్

# స్టేటస్

కౌన్సిలర్ వెంకటప్పయ్యకి కొడుకు నిర్ణయం నచ్చలేదు. కిరణ్ అమెరికాలో జాబ్ చేస్తున్నాడు. పెళ్ళి చేసుకుని వెళ్దామని నెలరోజులు సెలవుమీద ఇండియా వచ్చాడు. అతను వచ్చేటప్పటికే కొన్ని సంబంధాలు చూసి వుంచాడు వెంకటప్పయ్య. అందులో కిరణ్‌కి నచ్చింది సువర్ణ.

"వాడికి నచ్చితే సరిపోతుందా? అన్నీ చూసుకోవద్దూ!" అని కస్సుబుస్సుమన్నాడు భార్య ముందు.

"అన్నీ అంటే మీ దృష్టిలో కట్నమేగా! సువర్ణకి తండ్రి లేకపోయినా సుందర్రావు చెల్లెలికి ఏ లోటూ రానివ్వడులెండి" అన్నది సీతారత్నం.

"బుచ్చిరామయ్య కూతురు నాకు నచ్చింది. అన్ని విధాలా అనుకూలంగా వుంది" అన్నాడు వెంకటప్పయ్య తన మనసులోని మాట బైట పెడుతూ.

"అన్ని విధాలా అంటే, వాళ్ళు కట్నం ఎక్కువిస్తారనే గదా!" అన్నది సీతారత్నం.

"కట్నం కూడా ముఖ్యమేనే పిచ్చిదానా! రేపు నలుగురిలో ఏం చెప్పుకుంటాం? అమెరికాలో జాబ్ చేస్తున్నవాడికి నాలుగైదు లక్షల కట్నం అంటే ఏం గొప్పగా వుంటుంది? బుచ్చిరామయ్య పాతిక లక్షలు ఇవ్వడానికి రెడీగా వున్నాడు" చెప్పాడు వెంకటప్పయ్య.

"మీరు అదంతా కిరణ్‌తో మాట్లాడి ఖాయపరుచుకోండి. ఇలా నానపెడుతూ వుంటే నెలరోజులు ఇట్టే తిరిగిపోతాయి. వాడు అమెరికాకి తుర్రుమంటాడు. అక్కడే తెల్లపిల్లనో కట్టుకుంటే మీ తిక్క వదుల్తుంది" అని హెచ్చరించింది సీతారత్నం.

వెంకటప్పయ్య ఆలోచనలో పడ్డాడు.

* * *

అక్కడ సుందర్రావు తల్లి కూడా సువర్ణకి ఈ సంబంధం కుదిరేట్టు చేయమని దేవుళ్ళకు మొక్కుతోంది. అల్లుడు అమెరికాలో వుద్యోగం చేస్తున్నాడంటే గొప్పగా వుంటుందని ఆమె ఆశ. వెంకటప్పయ్యకి డబ్బాశ అని సుందర్రావుకి తెలుసు. కౌన్సిలర్‌గా పనిచేసి ఎంత సంపాదించినా తృప్తి లేదు అతనికి. అతని ఏరియాలో మున్సిపాల్టీ కాంట్రాక్టులు చేసేవాళ్ళని కమీషన్ కోసం కాల్చుకు తింటాడని అనుకుంటారు. తల్లిపోరు పడలేక వెంకటప్పయ్య దగ్గరికి వెళ్ళి కలిశాడు సుందర్రావు.

"రావయ్యా సుందర్రావు. మీ గురించే అనుకుంటున్నారు. ఇంతలో నువ్వే వచ్చావు" అని ఆహ్వానించాడు వెంకటప్పయ్య.

లోలోపల మాత్రం పళ్ళు నూరుకున్నాడు. ఇతగాడు చెల్లెలికి ఐదు లక్షలు కట్నం ఇవ్వడానికి సిద్ధపడి వున్నాడు. మనం పది లక్షలు అడిగితే సరి, దిమ్మతిరిగిపోతాడు. మళ్ళీ తొంగిచూడడు అని ఆలోచిస్తున్నాడు.

"అమ్మ మిమ్మల్నొకసారి కలిసి రమ్మందండీ" అని కూర్చున్నాడు సుందర్రావు.

"చూడు సుందర్రావ్! ముసుగులో గుద్దులాట ఎందుకు? మా వాడికి అవతల చాలా ఆఫర్లున్నాయని నీకు తెలుసు. కనీసం పది లక్షలు కట్నం ఇస్తే గాని నేను ఒప్పుకోను. రేపు చెప్పుకోవడానికైనా వుండాలి కదా! తర్వాత నీ ఇష్టం" మొహమాటం లేకుండా అన్నాడు వెంకటప్పయ్య.

ఇక సుందర్రావు మాట్లాడ్డానికి ఏం లేకపోయింది.

"సరేనండి. అమ్మతో మాట్లాడి ఏ సంగతి చెప్తాను" అని బయల్దేరాడు సుందర్రావు.

"తొందరగా తేల్చి చెప్పండి" అన్నాడు వెంకటప్పయ్య.

'ఇక వీడు రాడు. తోక ముడుస్తాడు' అని నవ్వుకున్నాడు.

* * *

వెంకటప్పయ్య పది లక్షలు కట్నం మీదున్నాడని తల్లికి చెప్పాడు సుందర్రావు. ఆమెకు ఈ సంబంధం వదులుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు.

"పోనీ ఇంటి స్థలం అమ్మాయి పేర పెడతామని చెప్పు. అది పది లక్షలు చేస్తుంది గదా!" అన్నది.

సుందర్రావు తండ్రి అది చౌకగా కొన్నాడు. ఇప్పుడు బాగా రేటు పెరిగింది. ఎప్పటికైనా ఇల్లు కట్టుకోవాలని అతని వుద్దేశ్యం. అమ్మేస్తే ఇప్పుడున్న పాత ఇల్లు అమ్మడం మంచిది. కానీ దీనికి అంత డబ్బు రాదు. ఎంత సెంటర్లో వున్నా ఏభై గజాల ఇంటికి ఐదు లక్షలు మించిరాదు. స్థలం సువర్ణకి ఇవ్వడం సుందర్రావుకి ఇష్టం లేదు. కానీ తల్లికి ఈ సంబంధం బాగా నచ్చింది. తను వద్దంటే బాధపడుతుంది అని ఆలోచనలోపడ్డాడు.

సుందర్రావు ఫ్రెండ్ కాంతారావుకి జరిగిన సంగతంతా చెప్పి సలహా అడిగాడు.

"మీ అమ్మ కోరిక తీర్చడమే ధర్మం. పోతే పోయింది ఆ స్థలం. నీ చెల్లెలు సుఖపడుతుంది. ముందు ముందు నువ్వు మంచి ఇల్లు కట్టుకోవడానికి డాలర్లు పంపిస్తుందేమో?" అన్నాడు కాంతారావు నవ్వుతూ.

వెంకటప్పయ్యకి ఫోన్ చేసి పది లక్షలు విలువ చేసే ఇంటి ప్లాట్ ఇస్తానని చెప్పాడు సుందర్రావు. అతను వీల్లేదన్నాడు. క్యాష్ ఇస్తేనే మాట్లాడమన్నాడు. చేసేదేం లేక సుందర్రావు ప్లాట్ అమ్మేసి పదకొండు లక్షలు రెడీ చేశాడు.

సుందర్రావు ప్లాట్ అమ్మేసి పది లక్షలు క్యాష్ తీసుకుని వస్తున్నాడని ఫోన్ రాగానే వెంకటప్పయ్య వర్రీలో పడిపోయాడు. 'తను పాతిక లక్షలు అడిగితే బాగుండేది' అని విచారపడ్డాడు. అవతల బుచ్చిరామయ్య సంబంధం చేసుకుంటే పాతిక లక్షలు వస్తాయి.

'ఛా...తప్పు చేశాను' అని ఆలోచనలోపడ్డాడు ఇప్పుడెలా అడ్డం తిరగాలా అని.

రాజకీయాల్లో తిరిగేవాడికి సాకులకేమి కొదవ? 'పెరుగులో రాళ్ళొచ్చాయని' పెళ్ళాన్ని

చావబాదే రకం. రాత్రికి రాత్రి పార్టీలు మార దంలో అందె వేసిన చెయ్యి.

సుందర్రావు తన స్నేహితుడు కాంతారావుని వెంట బెట్టుకుని డబ్బుతో వచ్చాడు. అప్పుడు కిరణ్ కూడా వున్నాడు. సీతారత్నానికి సంతోషంగా వుంది. భర్త అడిగిన కట్నం సమకూర్చినందుకు సుందర్రావుని మెచ్చుకుంది. వెంకటప్పయ్య మాత్రం ముఖం గంటుపెట్టుకుని కూర్చున్నాడు. అందరి దృష్టీ వెంకటప్పయ్య మీదే వుంది. తృప్తిలేని మానవుడు. మళ్ళీ ఏం పేచీ పెడతాడోనని సుంద్ర రావుకి లోలోపల భయంగానే వుంది. భర్త ఏం కుట్రలు పన్నుతున్నాడోనని సీతారత్నానికి అను మానమే. దేన్నీ ఒక పట్టాన తెగనివ్వకుండా సాగదీ యడం అతని నైజం. కిరణ్‌కి కూడా తండ్రి అసహ నంగా ఎందుకున్నాడో అర్థం కాలేదు. సంతలో గొడ్డుని బేరమాడి నట్లు తనని నిలబెట్టి కట్నాలు బేరమాడ్డం అతనికి చిరాకుగా వుంది. తండ్రి ఏ సంబంధం కుదరనివ్వడనీ తను తిరుగుప్రయాణం కావడం ఖాయమనీ అనుకుం టూనే వున్నాడు.

"డబ్బు తెచ్చావు బాగానే వుంది. కాని స్టేటస్ కూడా చూసుకోవాలి కదా సుందర్రావూ!" అన్నాడు వున్నట్టుండి వెంకటప్పయ్య.

స్టేటస్ ఏమిటో సుందర్రావుకి అర్థం కాలేదు.

"స్టేటస్ ఏంటండీ? మేము మీ కులమేగా!" అన్నాడు అయోమయంగా సుందర్రావు.

"కులం కాబట్టే ఇంత దూరం వచ్చావు. అది కాదు. రేపు మా వాడి మామ ఏంటి, అంటే ఏం చెప్తాం? మీ నాన్న ఆఫీసులో ప్యూను గదా!" అన్నాడు వెంకటప్పయ్య వెటకారంగా.


సుందర్రావుకి బుర్ర తిరిగిపో యింది. వళ్ళు మండింది. వెంకటప్పయ్య మాటలు విని. అతని ముఖంలో రంగులు మారాయి.

"మా నాన్న చనిపోయాడు కదండీ. ఆయన ఏం వుద్యోగం చేస్తే ఏవైంది? మీరడిగిన పది లక్షలు తెచ్చానుగదా!" అన్నాడు సుందర్రావు కోపం అణు చుకుంటూ.

"చనిపోయినా! ప్యూనుగా చేసేవాడంట అని చెప్పుకోరూ!" అన్నాడు వెంకటప్పయ్య నవ్వుతూ.

"చనిపోయిన వాళ్ళ స్టేటస్ గురించి ఆలోచిస్తే అసలు మీకు పెళ్ళే అయ్యేది కాదుగదా!" అని ఎత్తిపొడిచాడు సుంద ర్రావు.

వెంకటప్పయ్య అదిరిపడ్డాడు సుందర్రావు మాటలు విని.



"ఏంటీ? నాకు పెళ్ళయ్యేది కాదా?" అన్నాడు బిత్తరపోయి.

"ఔనండీ! మీ నాన్న స్టేటస్ ఏంటి చెప్పండి? పట్నం బజార్లో ముఠామేస్త్రీయే గదా! కొట్ల దగ్గరికి వచ్చే లారీల్లో సరుకులు దించడం, ఎత్తడం, అంటే కూలిపనే గదా!" అన్నాడు సుందర్రావు వెటకారంగా.


వెంకటప్పయ్యకి నోటి వెంట మాట రాలేదు.

"మీ మామగారు స్టేటస్ గురించి ఆలోచించి వుంటే అత్తయ్యగారిని మీకిచ్చి పెళ్ళి చేసేవారా? పెళ్ళప్పటికి మీ స్టేటస్ ఏంటి? సైకిళ్ళు రిపేరు చేసుకునే షాపే గదానడుపుతోంది" అన్నాడు సుందర్రావు రెచ్చిపోతూ.

"ఊరుకో సుందర్రావూ! అవన్నీ ఇప్పుడెందుకు?" అని కాంతారావు స్నేహితుణ్ణి వారించాడు.

"ఔనండీ! సుందర్రావుగారూ! అదంతా ఇప్పుడెందుకు? మా నాన్నంటే చాదస్తం..మీరేంటి చదువుకున్నవారు.." అంటూ కిరణ్ సుందర్రావు దగ్గరికి వచ్చి భుజం మీద చెయ్యి వేసి అనునయించాడు.


"మీ మావయ్య సంగతి తెలిసిందేగా! లేనిపోని వంకలు పెడుతుంటాడు ప్రతిదానికీ. నువ్వే మనసుకోకు. రేపు మూడు ముళ్ళు పడితే నీ చెల్లెలు అమెరికా వెళ్ళిపోతుంది హాయిగా. ఈయన్తో ఏంటి?" అన్నది సీతారత్నం భర్తవైపు కొర కొర చూస్తూ.




తను ఒంటరైపోయిన సంగతి గ్రహించి కంగుతిన్నాడు వెంకటప్పయ్య. వెంటనే ప్లేటు ఫిరాయించాడు.

"నేనేమన్నానని అంతా నా మీద విరుచుకుపడుతున్నారు? ఏదో మాటవరసకి వున్నమాట అన్నాను" అన్నాడు.

"సర్లెండి సంబరం. డబ్బు లెక్క చూసుకోండి" అని సుందర్రావు చేతిలోని బ్రీఫ్‌కేసు అందుకుని వెంకటప్పయ్యకి అందించింది సీతారత్నం.



"మనం లోపలకెళ్ళి మాట్లాడుకుందాం రండి బావగారూ!" అని కిరణ్ వరస కలిపేశాడు నవ్వుతూ.

సుందర్రావు, కాంతారావు లేచి కిరణ్ వెంట అతని బెడ్‌రూమ్‌లోకి వెళ్ళారు.

"మా నాన్న అన్న మాటలు మనసులో పెట్టుకోకండి. ఆయన స్వభావమే అంత!" అన్నాడు కిరణ్ తండ్రి మాటలకు బాధపడుతూ.

"అబ్బే అదేం లేదులెండి బావగారూ!" అని సర్దుకున్నాడు సుందర్రావు.

సీతారత్నం అప్పటికప్పుడు పురోహితుడిని పిలిపించి ముహూర్తాలు పెట్టించింది. పెళ్ళి చెయ్యడానికి మేరేజ్ హాల్ దొరక్కపోతే ఏదైనా హోటల్లో కాన్ఫరెన్స్ హాలైనా ఫరవా లేదని కిరణ్ సలహా ఇచ్చాడు.

అంతా సవ్యంగా జరిగినందుకు వూపిరి పీల్చుకొని వెంకటప్పయ్య ఇంటినుంచి బైటపడ్డాడు సుందర్రావు.

"ఔనోయ్! సుందరం, వెంకటప్పయ్య సైకిల్ షాపు నడిపేవాడనీ, సైకిళ్ళు అద్దెలకిచ్చేవాడనీ మనకి తెలుసు. అదృష్టం బాగుండి కౌన్సిలర్ అయ్యాడనుకో. ఆయన తండ్రి ముఠామేస్త్రి అని నీకేం తెలుసు?" అని అడిగాడు కాంతారావు.

"నాకేం తెలుసోయ్! ఏదో నోటికొచ్చింది అనేశాను" అని నవ్వాడు సుందర్రావు.

"గమ్మత్తుగా వుందే? వెంకటప్పయ్య కూడా నోరెత్తలేదు మరి. నిజంగా ముఠామేస్త్రిగా చేసేవాడంటావా?" ఆశ్చర్యపోతూ అన్నాడు కాంతారావు.

"ఏదో చీకట్లో రాయి విసిరాను. పాత రోజుల్లో మనవాళ్ళు ఏం చేసేవాళ్ళేం? చదువులా? సంధ్యలా? తాపీమేస్త్రీలు, ముఠామేస్త్రీలేగా! మా తాత కూడా ముఠామేస్త్రీనే. అందుకే అనేశాను" అని పకపకా నవ్వాడు సుందర్రావు.

కుక్కకాటుకి చెప్పుదెబ్బలా వెంకటప్పయ్యకి తగిన బుద్ధిచెప్పి, సమయస్ఫూర్తి ప్రదర్శించినందుకు స్నేహితుణ్ణి మెచ్చుకున్నాడు కాంతారావు.

○

## అంతా వుట్టిదే!

హీరోయిన్ సంగీత-గాయకుడు క్రిష్‌లు పెళ్ళి చేసుకున్నారనే వార్త ఒక్కసారిగా గుప్పుమందీమధ్య. దీనికి ఇద్దరూ వెంటనే స్పందించారు. మహేశ్వరి పెళ్లికి విడివిడిగా హాజరైన మా ఇద్దర్నీ చూసి లేనిపోని వార్తలు పుట్టించారు అనేది ఆ ఇద్దరి వాదన. అయితే ఇద్దరి మధ్యా 'దోస్తీ'ని బట్టే ఇలాంటి వార్తలకి ఆస్కారం కలుగుతోందని కొంతమంది సినీజనాలు గుసగుసలాడుకుంటున్నారు. నిజం నిలకడ మీద తెలుస్తుంది. కంగారెందుకు కదా!